# అనగనగా... ఒక కథ

ఇత్రి

# నీ దయ...రాదా!

**అడ్వొకేట్ నరహరి మహో గ్రంగా ఉంటాడు.**

**ఎవరితో మాట్లాడుతున్నా ప్రతిపక్షపు లాయర్‌తో మాట్లాడుతున్నట్టే ఫీలయిపోతూ ఊగిపోతుంటాడు- ఇంట్లో కూడా అంతే.**

**"ఏవండీ నేను మీ పెళ్లాన్ని- ఇది కోర్టు కాదు ఇల్లు" అని చాలాసార్లే భర్తకి గుర్తుచేసి కంట్రోల్లోకి తెస్తుంటుంది సుమతి!**

నరహరికి మంచి లాయర్‌గా మంచి పేరుంది!

ముఖ్యంగా విడాకులు ఇప్పించడంలో ఘటికుడన్న ఖ్యాతి వుంది. తొలిరాత్రి దంపతుల్నించి, ఏభై ఏళ్లు కాపురం చేసిన వాళ్ల దాకా ఎవర్నైనా సరే..విడాకులు ఇప్పించడానికి ఆయన కేసు వొప్పేసుకుంటాడు. క్లయింట్ స్త్రీ అయినా- పురుషుడైనా సరే కావల్సినన్ని లాజిక్కులూ లాట్రిక్కులూ వాడతాడు.

ఇంట్లోనే ముందు హాల్లో ఆఫీసు రూమ్ ఉండటంతో నరహరి మాట్లాడే ప్రతీ మాటా సుమతికి వినిపిస్తోంటుంది. ఒక్కోసారి చిరాకు కూడా వేస్తుంటుంది. ఎంత వద్దనుకున్నా ఆయన క్లయింట్‌తో మాట్లాడే మాటలు వినక తప్పట్లేదు సుమతికి.

తెలుగునేల పత్రిక తిరగేస్తోంది- 'నీ దయ రాదా..' అన్న టైటిల్తో ఉన్న కథని చదవటం మొదలెట్టింది. కానీ మనస్సు ఏకాగ్రత కోల్పోతోంది భర్త క్లయింట్‌తో మాట్లాడుతున్న మాటల వల్ల.

"ఇంతకన్నా ఎవిడెన్సులు ఏం కావాలండీ మీ ఆవిదతో హాయిగా విడాకులు తీసుకోవచ్చు. ఏం ఫికర్ చేయకండి.. ఒక్క పిటీషన్ రాస్తే రిప్లై గిర గిర తిరిగి వస్తుంది. తనంతట తనే మహాప్రభో విడాకులు కావాలని ఇంకో ఎడ్వొకేట్‌ని అడుగుతుంది. నీ విడాకుల కేసు నాకు నాలుగొందల తొంభై ఎనిమిదోది. మనం కేసు వప్పుకున్నామంటే...మొగుడు పెళ్లాం విడిపోవటంలో ఏమీ గడబిడలూ శషభిషలూ వుండవు- మనోవర్తిలూ ఆస్తిలో వాటాలూ కూడా వుండవు- ఇంకొక్క రెండు కేసులు దొరికితే గిన్నిస్..కనీసం లిమ్కా బుక్‌లోకి ఎక్కేయగల్ను నేను" అంటున్నాడు నరహరి.

వినిపిస్తున్న మాటలు వినలేక బెడ్‌రూమ్‌లోకి వెళ్లి కథ చదువుకుంటోంది సుమతి.

'నీ దయ రాదా..' కథ ఆసక్తితో చదివి బైటకొచ్చింది.

నరహరి క్లయింట్స్‌తో ఇంకా మాట్లాడుతూనే వున్నాడు.

ఇంటర్‌కమ్ నొక్కి భర్తని లోపలికి రమ్మంది.

హడావుడిగా వచ్చాడు.

"ఏంటి?"

"ఈ కథ చదవండి"

"ఇప్పుడా? అవతల క్లయింట్స్ ఉన్నారు- తర్వాత చదువుతా"

"క్లయింట్స్‌తో మాట్లాడే ముందే చదవడం మంచిది. నేను కాఫీ పెడతాను. ఈలోగా కథ చదవండి. వచ్చిన వాళ్లు పారిపోరు. కూర్చుంటారు" అని వంటింట్లోకి వెళ్లిపోయింది పత్రిక అందిస్తూ.

నరహరి కథ చదవడం ప్రారంభించాడు.

☆ ☆ ☆

ఓరోజు తప్పతాగి వాగిన వాగుడుకి యుగయుగాల అపఖ్యాతి కలిగింది చాకలి తిప్పడికి.

దేశం అందరికి తల్లిలాంటి జానకమ్మని రాములోరు తనవల్ల అడవులకి పంపేశారు.

ఆ మాట వినగానే తన భార్య రామ్ రామ్ చెప్పేసి వెళ్లిపోయింది! తను చేసిన పాపానికి ఆ శాస్తి జరగాల్సిందే.

ఆత్మహత్య చేసుకుని చచ్చిపోవాలని ఉంది వాడికి.

పోయేముందు ఒకసారి రాముడు పాదాలు పట్టుకుని భోరుమని ఏడవాలని ఉంది.

తనలాంటి వదరుబోతుని బర బర సభకి లాక్కెళ్లి మరణ దండన శిక్ష విధించాలి. కానీ ఆ మహాప్రభువు పిలుపురావట్లేదు.

దానికోసం ఎదురు చూస్తున్నాడు.

రాజ్యం అంతా తిరుగుతూ 'ఆ తల్లి మన మహారాణి... మీద నింద వేసింది నేనే...' అంటూ ఉండుండి వెక్కెక్కి ఏడుస్తున్నాడు.

జనం గుంపులు గుంపులుగా వున్న చోట మధ్యకెళ్లి "ఇంతమంది ఉన్నారే..ఏ ఒక్కడికైనా నాలాంటి పాపిష్టివాణ్ని మహారాజా వారి దగ్గరకి తీసుకెళ్లాలనిపించట్లేదా- మీ అంతట మీకే నరికి పోగులెట్టాలని అనిపించట్లేదా" అని పిచ్చెక్కినట్లు కలదిరుగుతున్నాడు.

వారం రోజులుగా వాడికి తిండీ తిప్పలూ లేవు.

రహదారుల్లో రాజమార్గాల్లో స్త్రీలు కనపడగానే అల్లంత దూరం నుంచి సాగిలపడిపోయి- "సీతమ్మ తల్లీ నేను తప్పు చేశాను" అంటూ ఏడుస్తున్నాడు.

ఒక పిచ్చివాణ్ని చూసినట్లు ఆడంగులు వణికి పారిపోతున్నారు.

రామాజ్ఞ కాలేదని నగర ప్రజలు ఉపేక్షిస్తున్నారుగానీ నిజానికి వాణ్ని నరికి పోగులు పెట్టాలని అందరూ అనుకుంటున్నారు.

రాత్రీ పగలూ ఎండా వానా ఏమీ అతను లెక్క చెయ్యట్లేదు. జవాబులు చెప్పాల్సిన ప్రజలు మౌనం వహించి వెళ్లిపోతున్నాక చెట్టు మీద పిట్టకి- చెట్టు కింద కుక్కకీ అవీ పారిపోతుంటే కొండకీ గుట్టకీ రాయికీ రప్పకీ తన పాపాన్ని చెప్పుకుని రోదిస్తున్నాడు వాడు.

కళ్లలో నీళ్లు ఇంకిపోతున్నాయి. కాళ్లు సత్తువ కోల్పోతున్నాయి.

గొంతు శక్తి గొణుగుడులోకి దిగిపోతోంది.

వాడు పిచ్చివాడైపోతున్నాడు.

గుండె చప్పుళ్లలో రామ నామ స్మరణ చేస్తూ 'నీ

రాత్రీ పగలూ ఎండా వానా ఏమీ అతను లెక్క చెయ్యట్లేదు. జవాబులు చెప్పాల్సిన ప్రజలు మౌనం వహించి వెళ్లిపోతున్నాక చెట్టు మీద పిట్టకి- చెట్టు కింద కుక్కకీ అవీ పారిపోతుంటే కొండకీ గుట్టకీ రాయికీ రప్పకీ తన పాపాన్ని చెప్పుకుని రోదిస్తున్నాడు వాడు. కళ్లలో నీళ్లు ఇంకిపోతున్నాయి. కాళ్లు సత్తువ కోల్పోతున్నాయి.


దయ రాదా' అని గొంతులేని గోదుని..పంచ భూతాల్తోనూ రాముడికి పంపిస్తున్నాడు.

వాడిలో ఒక మహాభక్తుడు రూపు దాలుస్తున్నాడు.

పశ్చాత్తాపంలో పరమభక్తుడు ఆవిర్భవిస్తున్నాడు.

అంతలో..అంత చీకట్లో ఎవరివో అడుగుల చప్పుడు.

రాముడి మీదే ధ్యాస వున్న వాడికి - రాముడే నడిచి వచ్చాడన్న ఆశ కలిగింది. ఓపిక కూడదీసుకుని..మోకరిల్లాడు.



"రామయ తండ్రీ, వచ్చావా, మీ జంటని విడగొట్టిన పాపాత్ముణ్ని శిక్షించడానికి వచ్చావా? చంపెయ్ నీ బాణంతో నాకు ముక్తిని..కాదు.. విముక్తిని ఇయ్యి రామభద్రా!" అన్నాడు.

అతన్ని లేవనెత్తి.."నేను రామభద్రుణ్ని కాదు. వేగు భద్రుణ్ని" అన్నాడు వచ్చిన వ్యక్తి.

అంతే..వాడిలో వెయ్యేనుగుల బలం ఆవహించింది.

వేగుభద్రుడి మీద ఆగ్రహం అతనికి అనంతమైన శక్తినిచ్చింది- వేగుభద్రుడి పీకపట్టుకున్నాడు-

"నువ్వే..నువ్వే..నా తల్లి సీతమ్మనీ, నా తండ్రి రామయ్యనీ విడగొట్టిన పాపాత్ముడివి. ఒక తాగుబోతు ప్రేలాపనని రాముడు లాంటి ధర్మ స్వరూపుడికి చెప్పావూ- ఆయన భార్యని విడిచిపెట్టేయడానికి కారకుడవు అవుతావూ. ఈ తప్పులో నాది ఎంత భాగం నీది ఎంత భాగం- రామచంద్ర ప్రభువుది ఎంత భాగం-చెప్పు" అంటూ పీకని పట్టుకుని పట్టుని బిగించాడు.

పీకపట్టు వదిలేసి మళ్లీ ఏడిచాడు.

"నేను తెలివితేటలు లేని తాగుబోతుని..నువ్ తెలివితోనే ఉద్యోగం చేస్తున్న గూఢచారివి..మనిద్దరి వల్ల ఏం జరిగింది?" కుప్పకూలిపోయి కుమిలిపోయాడు.

వేగుభద్రుడి నోటి నుండి చాలాసేపు మాట రాలేదు.

వాడిమీద ఉన్న అసహ్యం-కోపం-అన్నీ పోయి జాలి కలిగింది. ఇప్పుడు...అతని మీద గౌరవం కలిగింది.

"ఒరే...నాకు నీయంత ప్రాజ్ఞత లేదురా..చాకలి కులంలో పుట్టావు గనక నా మనస్సుని ఉతికి ఆరేశావు- నిన్ను గత వారంగా గమనిస్తూనే వున్నాను. నాకు నీమీద గౌరవం కలిగింది" అన్నాడు వేగుభద్రుడు.

"నాకు గౌరవాలొద్దు శిక్ష కావాలి. రామరాజుగారి దర్శనం ఇప్పించు. ఆయన కాళ్లు పట్టుకుని మరణ శిక్ష వేడుకోవాలి. తమరు వేగులు. వీధి వీధీ తిరిగి ధర్మస్థాపన చెయ్యడానికి రామచంద్రులకి సహకరిస్తారుగా-ఈ అభాగ్యుడి కథ చెప్పండి! నన్ను వారి వద్దకు చేర్చండి" అన్నాడు.

వేగుభద్రుడి కళ్లలో నీళ్లు పొంగాయి.

"నేను ఇప్పుడే నీ వ్యధ చెప్తాను" అన్నాడు తడిలో పొడిగా.

★ ★ ★

వేగుభద్రుడి మాటని రామభద్రుడు విన్నాడు.

"భద్రా! నాకు రాజధర్మాన్ని గుర్తు చేసిన తిప్పడు అంటే వాల్మీకి మహర్షిమీద ఉన్నంత గౌరవం ఉంది- ఇద్దరూ నన్ను..మనిషి నుంచి మనీషిగా నిలబెట్టిన వారే" అన్నాడు రాజారాముడు.

★ ★ ★

ఓ చీకటిలో చెట్టుకింద రామస్మరణ చేస్తున్న తిప్పడు-కళ్లు మూతలు పడిపోయాయి.

నీలిరంగు కాంతులు-నీలాకాశం మెరుపులు ప్రజ్వలించాయి.

అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతున్నాయి.

ఆదర్శదంపతులైన ఆలుమగల మధ్య వియోగం కలిగించిన పాపాత్ముడి పాపం ప్రక్షాళనమై వైకుంఠయానం చేస్తున్నాడు.

అతడి భౌతిక శరీరం భూమిలో కలిసింది- సీతమ్మ తల్లి కాళ్లు పట్టుకోడం ఎదురుచూస్తూ...

★ ★ ★

నరహరి కథ చదివేటప్పటికి భార్య కాఫీ తెచ్చి ఇచ్చింది.

నరహరి కాఫీ అక్కర్లేదన్నాడు.

ముందు హాల్లో వెయిట్ చేస్తున్న క్లయింట్ దగ్గరికి వెళ్లి 'తాను డైవోర్స్ కేసులు టేకప్ చెయ్య'నని చెబ్దామని బైల్దేరబోయాడు.

"ఒక్క మాట వినండి- విడాకులకు నేను వ్యతిరేకిని కాదు- మంచి దంపతుల్ని విడకొట్టటం ఎంత పాపమో, ఇబ్బంది పడేవాళ్లకి విడాకులు ఇప్పించడం అంత మంచిది" అంది సుమతి.

"నీ దయ వల్ల..'నీ దయ రాదా' కథ వల్ల నాకు ఓ గొప్ప సందేశం దొరికింది. నా రికార్డ్‌లో చివరి కేసు నీదే అవకుండా తిప్పడు నన్ను ఉతికేశాడు-దట్సాల్ యువర్ ఆనర్!" అంటూ నరహరి ముందు రూమ్‌లో క్లయింట్స్ కేసి నడిచాడు.

☆